# ఇట్లు... తమ విశ్వాసపాత్రుడు

**లో**కంలో అందరూ జీవించాలి గనుక వ్యాపారమో, ఉద్యోగమో చేస్తారు. కాని ఉద్యోగమే జీవితంగా ఉండే మనుషులు ఉంటారని నేనంటాను!

మీరు నమ్ముతారా?

నమ్మలేరా?

నిజంగా నమ్మలేరా?

అయితే మీకు గుర్నాథాన్ని చూపించాల్సిందే!

గుర్నాథం అంటే ఎవరు? అతనేమైనా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియానా? బాలీవుడ్ నటుడు అమితాబ్ బచనా?... హాలీవుడ్ నటుడు చార్లీ చాప్లీనా.... అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటనా?

గుర్నాథం అంటే ఆసియా ఉపఖండమైన భారతావనిలో, ఆంధ్రరాష్ట్రంలోని రెవెన్యూశాఖలో, అనంతపురానికి చెందిన యూనిట్‌లో అతను ఒక మామూలు సగటు ఎన్.జీ.వో! ఇంకా చెప్పాలంటే గుమాస్తా! మరింత వివరంగా చెప్పాలంటే సీనియర్ సహాయకుడు.

యస్, గుర్నాథం ఈజ్ ఏ సీనియర్ ఆసిస్టెంట్!

సరేలే గుర్నాథం ప్రత్యేకతేమిటీ? అని మీరడగవొచ్చు. అడగొచ్చేమిటి అడిగి తీరుతారు...మీరట్లా అడిగినప్పుడు సమాధానం చెప్పడానికి నా దగ్గర కావలిసినంత సరుకు ఉందండోయ్! అదంతా ముందు ముందు మీకు మనవి చేసుకోగలను.

మరయితే ఎక్కడున్నాడు గుర్నాథం? వెంటనే కలుస్తాం! అంటారా!

అయితే రండి.....

ఈ హాస్పిటల్లో అల్లదిగో ఆ చివర గది వుందే... దాన్ని పురుషుల వార్డని తెలుగులోనూ, మేల్‌వార్డని ఇంగ్లీషులోనూ అంటారు.

ఆ గదిలో....

అదిగదిగో, ఆ మూల్లోని చివరి మంచంపై వెల్లకిలా పడుకుని ఉన్నాడే అతనే గుర్నాథం! అతని ముక్కులోకి ట్యూబు వుంది. మంచం పక్కన సెలైన్ బాటిల్, స్టాండుకు వేలాడుతూ వుంది. ప్రస్తుతం అతను కోమాలో ఉన్నాడు.

అతని పక్కనే దీనంగా చూస్తూ, కొద్దిగా రేగి వున్న జుత్తుతో, కొంతమాసిన ఆకాశం రంగు చీరలో ఉన్న 45 ఏళ్ళ ఆవిడ గుర్నాథం భార్య జానకి. అతని కాళ్ళ దగ్గర దిగులుగా నిలుచున్న పదారూ, పదిహేడేళ్ళ పిల్లలు, సుగుణ, సుశీలలు గుర్నాథం కూతుళ్ళు.

"ఏం గుర్నాథం! ఏం సంపాదించినావు? అని ఎవరైనా అడిగితే పిల్లల్ని చూపించి నవ్వేవాడతను. ఆ ఇద్దరు ఆడ పిల్లలూ కాక వాళ్ళకంటే పెద్దవాళ్ళు ఇద్దరు అబ్బాయిలు వున్నారు గుర్నాథానికి. ఒకరేమో హైదరాబాద్ సెక్రటేరియేట్‌లో క్లర్కుగానూ, మరొకరేమో విశాఖలో బ్యాంకు క్యాషియరుగానూ వున్నారు. వాళ్ళ వాళ్ళ కుటుంబాలతో అక్కడే వుంటున్నారు. ఏ పండగలకో, పబ్బాలకో వస్తుంటారు. గుర్నాథాన్ని హాస్పిటల్లో అడ్మిట్ చేస్తూనే ఫోన్ చేసి వెంటనే 'రమ్మని' చెప్పింది జానకమ్మ. వాళ్ళు మరి కాసేపట్లో రావచ్చు!

గుర్నాథానికి భార్యంటే పంచప్రాణాలూను. పిల్లలంటే ఆరోప్రాణమే. అయితే తన సర్వప్రాణాల్నీ, ఉద్యోగంలో చూడటం వల్లనే ప్రస్తుతం అతనలా కావడానికి అసలు కారణమని సహోద్యోగుల అభియోగం! అవును అతని మెదడుకీ, చేతికీ తప్పా మరొక అవయవానికి పని ఎక్కువగా లేనందువల్ల క్లోమగ్రంథి 5 సంవత్సరాల క్రితమే పనిచేయడం మానుకున్నది. చక్కెర వ్యాధి అన్నారు డాక్టర్లు. అప్పటినుంచి ఆహార విషయంలో జాగ్రత్తలు పాటించాలనుకున్నాడు. ఆ విషయం ఏ 'జీఓ' లోనో, ఏ ఆక్టులోనో వుండి వుంటే ఖచ్చితంగా మంచి గుమస్తాగా పాటించేవాడే! అట్లా లేవు గనుకనే ఇప్పుడిలా రోగమెక్కువై కోమాలోకి వెళ్ళిపోయినాడు.

గుర్నాథంపై మరొక అభియోగం ఉంది. అతను సంసారి కాదని అతని దగ్గరి మిత్రులు అంటూ వుంటారు. అంతమాత్రం చాత అతని శీలాన్ని శంకించి, రోజొక తాజా రోజాపై వాలిపోతూ వుంటాడనుకుంటే మీరు పప్పులోనో, నిప్పులోనో కాలేసినట్టే. అతను శ్రీరామచంద్రునికి ఉన్న ఎన్నో సుగుణాలలో ఒక్కగానొక్క సుగుణం - ఏకపత్నీ వ్రతాన్ని మాత్రమే తన సొంతం చేసుకున్న మహా ఏకపత్నీవ్రతుడు" గుర్నాథం.

మరి అతను జూదరా!

కాదండోయ్ కానే కాదు. జూదం అన్న మాట తెలుగుదా? పాళీదా? పారశీకందా అన్న సంశయం కూడా లేదతనికి. ఆ మాట అసలు తెలుగుభాషలో ఉన్నట్టు అతనికి జ్ఞాపకం లేదు. పేకముక్కల్ని చూస్తే ఫర్లాంగు దూరం...మట్కాకు మైలు దూరం! కోడి పందేలకి కోసుడు దూరం అశ్వమేధానికి (అంటే గుర్రప్పందేలకి ఆమడ దూరం, వెధవది బారాకట్టా. పులి గీతం ఆడ్డం కూడా ఇష్టంలేదతనికి.

ఇంక అతను తాగుబోతని అందామా? అని అంటే... ఎప్పుడైనా మిత్రులతో బారు కెళ్ళి బీరు తాగిన పాపాన పోలేదు. వైను కల్సి వుంటుందేమోనని ఆయుర్వేదం టానిక్ 'ద్రాక్షారిష్టా' కూడా తాగడు.

అతను అల్లరి వల్లభుడు కాదనడానికి ఇంకా అనేకానేక దృష్టాంతరాలు రాస్తే పేజీలకొద్దీ, మాట్లాడితే గంటలకొద్దీ ఇచ్చేటన్ని ఉన్నాయని. అతని తోటి ఉద్యోగులందరికీ తెలుసు.

ఇంతకీ అతను సంసారి ఎందుక్కాదు? ఇది మిమ్మల్ని ఇంతసేపు వేధిస్తున్న ప్రశ్న? అసలు సంసారి లక్షణాలు ఏమిటి? పొద్దున్నే లేవడం, పళ్ళు తోమగానే కాఫీ తాగేసి మార్కెట్టుకి వెళ్ళి కూరగాయలు గట్రా కొనుక్కురావడం, పిల్లల్ని

స్కూటర్లోనో, సైకిల్లోనో స్కూలు వద్ద దింపి రావడం, తర్వాత ఆఫీసో, వ్యాపారమో చూసుకోవడం, మళ్ళీ సాయంత్రం పిల్లల్ని ఇంటికి తీసుకు వచ్చి, కావలసిన సరుకులు పట్టుకురావడం, హోమ్‌వర్కు చేయడంలో పిల్లలకి సాయపడ్డం. భార్య చేసిన వంటని బాగలేకున్నా, బావుందనీ... బావుంటే బ్రహ్మాండంగా వుందనీ, బ్రహ్మాండంగా వుంటే అత్యద్భుతంగా వుందనీ ప్రశంసించడం ఇలాంటి ఎట్ సెట్రా, వగైరా మొదలైనవి కలిగి వుండటమే కదా.

మరట్లాంటి లక్షణాలు ఒక్కటీ లేవు గుర్నాథానాకి..మరింకేం ఉన్నాయి?

అతను ఉదయం ఎనిమిదింటికి గానీ నిద్ర లేవడు. అట్లని అతడు బద్ధకస్తుడు కాదు. రాత్రి పన్నెండూ, ఒంటిగంట దాకా ఫైళ్ళు రాస్తుంటాడు. గనుక పొద్దున్నే లేవలేడు. గంటలో తయారయి ఆఫీసుకి బయల్దేరతాడు. క్యారియర్‌లో భోజనంతో సైకిల్ క్యారియర్‌లో ఫైళ్ళతో మళ్ళీ ఏ ఏడింటికో, ఎనిమిదింటికో ఇంటికి చేరుకుంటాడు. క్యారియర్ మాత్రం ఖాళీగా వుంటుందంతే. ఫైళ్ళు మామూలే. రాత్రి భోంచేస్తూనే మన 'కలం వీరుడు' ఫైళ్ళ పైకి విజృభింస్తాడు.

ఎప్పుడయినా సెలవు రోజుల్లో పాతిక రూపాయలిచ్చి కూరగాయలు తెమ్మంటే- ఇంక అంతే. ఇంటికొచ్చినాక ఏవేవి ఎన్నెన్ని తెచ్చినాడో లెక్కలు చెప్పలేక నోరు వెళ్ళ బెట్టడమూ, జానకమ్మ బుగ్గలు నొక్కుకోవడమూ, ఆ తెచ్చిన వాటిలో సగం చచ్చువీ, పుచ్చువీ వుండటం చూసి ఆమె తలపట్టుకోవటం అతి మామూలుగా జరిగే విషయం. అందుకే ఆమె తప్పనిసరి పరిస్థితుల్లో తప్పా, ఏ బేరసారాలకీ గుర్నాథాన్ని వెళ్ళనియ్యదు. అదీ ఇదీ ఏమంటే అతను వేసుకునే బట్టలు కూడా జానకమ్మే తెస్తుంటుంది.

జానకమ్మ ఒక్క విషయంలో కొంత తృప్తీ, మరికొంత అసంతృప్తీ! అదేమిటంటే తను ఏది వండి వడ్డించినా ఉప్పు ఎక్కువయిందనీ, కారం తక్కువయిందనీ అనదు గాక అనదు. యాంత్రికంగా తినడమే గుర్నాథం పని. అదీ ఆమె తృప్తి. అద్భుతమైన రుచిగల వంటా, అతి చెత్తగా వున్న కూరా ఒకటే గుర్నాథం దృష్టిలో. చింత తొక్కయినా, చికెన్ కూరయినా కంచంలో వడ్డించిన దాన్ని ఒకటే ఫేస్ ఫీలింగ్‌పెట్టి తింటున్న భర్తని చూసి అసంతృప్తితో నవ్వాలో, ఏడవాలో తెలీని సందిగ్ధంలో ఎప్పుడూ పడుతుంటుందామె.

మరయితే గుర్నాథానికి ఇష్టమైనవీ ప్రాణప్రదమైనవీ, తెలివిగా వ్యవహారం చక్కపెట్టుకు రాగల నేర్పుగల విషయాలేవైనా ఉండవా? అంటే - ఎందుకుండవ్?

అతనికి ఆఫీసంటే ఇష్టం! ఉద్యోగమంటే మరీ ఇష్టం! ఫైళ్ళంటే ప్రాణం! పర్సనల్ రిజిష్టరంటే ప్రాణప్రదం.

ఎంత చండశాసనుడైన ఆఫీసర్నయినా...ఎంతటి జగదేక మూర్ఖశిఖామణి అధికారినైనా సరే అత్యంత మెలకువతో తన ఆఫీసు ప్రజ్ఞాపాటవాలతో అతి నేర్పుగా ఫైలు విషయం చర్చించి, వివరించి ఎంతో లాఘవంతో దాన్ని అప్రూవ్ చేయించుకు రాగల ధీశాలి గుర్నాథం.

మరి ఎప్పుడైనా మీకు గుర్నాథంతో ఏదైనా పని పడిందనుకోండి. ఆహాఁ అనుకోండి చెబుతాను. వేరుగా ఆఫీసుకు వెళ్ళి "గుర్నాథం ఎవరండీ?" అంటూ

ఎవర్నీ అడిగే పనిలేదు. తిన్నగా ఆఫీసులోకి వెళ్ళగానే అందర్నీ గనుక ఒక అయిదు నిమిషాలు పరకాయించి చూడండి, ఎవరయితే తల ఎత్తకుండా ఫైలులో మునిగి టేబులు పైన దొంతర్లుగా ఫైళ్ళు పేర్చుకుని రాస్తున్నాడో అతని వద్దకు వెళ్ళండి - అతనే గుర్నాథం! అక్కడికీ మీకు అనుమానంగా ఉంటే సార్! అని పిలవండి పలకలేదా, తలెత్తి చూడలేదా? మరింకనేం అతనే నూటికి నూరు పైసలూ గుర్నాథం! ఫైలు రాసేటప్పుడు పక్కన బాంబు బద్దలయినా వినిపించుకోని వాడు ఒక్క గుర్నాథమే! ఎందుకంటే ఆయన ఫైళ్ళ తపస్వి మరి! అతను త్రేతాయుగంలో పుట్టలేదు కాబట్టి విశ్వామిత్రుడూ, వశిష్టుడు ఇత్యాదులంతా మహర్షులై పోయినారు. లేకుంటే వాళ్లని గురించి వాల్మీకి పొరపాట్నయినా రాసి వుండేవాడా? అదీ, అట్లాంటివాడు గుర్నాథం అంటే!

గుర్నాథం గురించి ఇంతాచెప్పి ఈ ఒక్కవిషయం చెప్పకపోతే అతన్ని అసంపూర్ణంగా చూపడమే అవుతుంది. అదేమిటంటే అతని 'యువర్స్ ఫెయిత్ ఫుల్లీ' మనస్తత్వం.

ఉదయం ఆఫీసుకు రాగానే అందర్నీ పేరుపేరునా పలుకరించి నమస్కరిస్తాడు. తన సీనియర్లనూ, ఆఫీసు సూపర్నింట్లనూ "గుడ్మానింగ్ సార్!" అంటూ సవినయంగా విష్ చేస్తాడు.

ఒకరోజు ఉదయం నమస్కారాల కార్యక్రమం పూర్తి చేసుకుని, తన సీటులో కూచున్నాడు గుర్నాథం. ఫైళ్ళు టేబుల్‌పైన పెట్టుకుంటూ ఉండగానే, అతని కొలీగ్ రామన్న చౌదరి తన టేబుల్ ముందున్న కుర్చీలో వచ్చి కూచుని - "నువ్వు చాలా అమాయకుడివయ్యా గుర్నాథం" అన్నాడు చాలా సీరియస్‌గా మొహంపెట్టి.

ప్రశ్నార్థకంగా చూశాడు అతన్ని గుర్నాథం. మళ్ళీ రామన్న చౌదరే అన్నాడు.

"నీకు యాభై ఏళ్ళు వచ్చినాయే కానీ అనుభవం రాలేదయ్యా" అతనిదీ గుర్నాథం వయసే. అయితే రామన్న చౌదరిది బట్టతల కావడం వల్ల పదేళ్ళు ఎక్కువ ఉన్నట్టు అనిపిస్తాడు.

"ఎందుకట్ల అంటున్నారు సార్!" అన్నాడు గుర్నాథం.

"అదికాదు గుర్నాథం! నువ్వు అందర్నీ విష్ చేస్తున్నావు బాగానే ఉంది. ఆ శ్రీధర్‌బాబుకి ఎందుకు నమస్కారం చేయాలి. అతను పక్క సెక్షను సూపర్నెంటు కదా!"

"ఎంతయినా అతనూ, ఈ ఆఫీసు మనిషేకదా!" అని అన్నాడు గుర్నాథం.

"మరయితే నువ్వు నమస్కరిస్తే అతను ప్రతినమస్కారం చెయ్యాలి కదా! కనీసం చెయ్యి ఎత్తే ప్రయత్నం కూడా చెయ్యడే. అతనికి మనుషుల పట్ల చులకన భావం!" అన్నాడు చౌదరి.

"నమస్కారందేముందిలెండి చౌదరీ!" అన్నాడు గుర్నాథం.

"అట్లనవద్దు గుర్నాథం...ఏ ఆఫీసులో ఎట్లాంటివాళ్ళు ఉన్నా మన డిపార్టుమెంటులో మాత్రం నాలుగురకాల మనుషులున్నారు. మనం నమస్కరిస్తూనే ఎంతో నమ్రతతో నమస్కరించే వాళ్ళూ, కొందరు వీడి మొహానికి ప్రతినమస్కారం కూడానా అని

ఎడంచేత్తో నామమాత్రం చేసేవాళ్ళు, మరికొందరు తమ హోదాకు భంగం వాటిల్లకుండా శిరఃకంపనంతో ప్రతి నమస్కారం చేసేవాళ్ళు. ఇంకొందరు బిచ్చగాణ్ణి చూసినట్టు చూపుతోనే ప్రతి నమస్కారంచేసేవాళ్ళు. ఈ చివరి రకానికి చెందిన వాడు శ్రీధరబాబు!" అట్లాంటి వాళ్ళని మనం కూడా నిర్లక్ష్యం చేయాలి!" అన్నాడు చౌదరి ఉక్రోషంగా.

"ఎందుకులెండి సార్! పాములకీ, గోవులకీ నమస్కరించే సంస్కారం ఉన్న దేశంలో పుట్టాము. గోవుకి నమస్కరించకుంటే అదేమీ అనదు. కానీ పాముకి నమస్కరించకపోతే అది కాటువేయవచ్చు. అధమం బుసకొట్టవచ్చు. ఈ డిపార్టుమెంటులో నాకింతవరకూ పాములెవరో, గోవులెవరో తెలుసుకునే కోరికా, తీరికా లేదు. అందరికీ నమస్కరిస్తే పోలేదా! ఇంక సంస్కారం అంటావా ఎవరిది వాళ్ళ కుంటుంది" అన్నాడు గుర్నాథం అతి మామూలుగా.

"సంస్కారమా? ఈ వెధవలకి? అవలీలగా కాళ్ళు ఎటుపడితే అటు వంగేటట్లుంటే, ప్రతి నమస్కారాన్ని ఎడం కాలితో ఎత్తి చేస్తారు. మన అదృష్టం! "ఆ ఫీటు" వాళ్ళకి రాక బతికిపోయాం" అంటూ వెళ్ళిపోయాడు చౌదరి.

నవ్వుతూ చూస్తూ వుండిపోయాడు గుర్నాథం!

గుర్నాథం తత్వం రామన్న చౌదరికి తెలుసు. అయినా అప్పుడప్పుడూ వచ్చి ఇలా చిన్న చిన్న లెక్చర్లిచ్చి రెచ్చగొట్టాలని చూస్తాడు.

బజార్లో ఎప్పుడయినా తన డిపార్టుమెంటు ఆఫీసరో, సూపర్నెంటో కనబడితే విష్ చేస్తాడు గుర్నాథం. వాళ్ళు పొరపాట్న చూడకుంటే వాళ్ళు తిరిగి చూసేవరకు చేయి దించడు. అక్కడికీ చూడలేదనుకోండి ఇంటికిపోయినా అతని మనసు వేదనకి గురవుతుంది. తన మీద ఏం కోపం ఉందో ఏమో, లేకుంటే తన విష్‌ని ఎందుకు అందుకోలేదు అని మధనపడతాడు. ఆ విషయం కూడా చౌదరి ఎప్పుడో పసిగట్టాడు. "ఆఫీసరు ఫోను చేస్తే వినయంతో లేచి ఫోన్లో మాట్లాడతావు. ఏమ్మనిషివి నువ్వూ... నువ్వు గుమస్తావా, కట్టు బానిసవా?" అంటూ ఎన్నిసార్లు ఎద్దేవా చేశాడు కూడాను.

అయినా గుర్నాథం తన వ్యవహారం మార్చుకోలేదు మరి!

★ ★ ★

మధ్యాహ్నం 12 గంటలయింది.

హైదరాబాదునించీ, విశాఖనుంచీ గుర్నాథం కుమార్లు మహేష్, దినేష్‌లు కలసి మాట్లాడుకున్నట్టుగా హాస్పిటల్ చేరుకున్నారు. వాళ్ళ వాళ్ళ ఫ్యామిలీలతో సహా. తండ్రి పరిస్థితి చూసి ఆందోళనపడ్డారు. డాక్టరు వద్దకెళ్ళి తండ్రి స్థితి గురించి అడిగారు.

"షుగరు ఎక్కువయిపోయింది. కోమాలోంచి బయటపడితే మీ అదృష్టం. శాయశక్తులా మా ప్రయత్నం మేం చేశాం. మరో ఆరుగంటలు గడిస్తేగానీ ఏం చెప్పలేం" అన్నాడు డాక్టరు.

నిస్పృహతో అక్కడినుంచి వచ్చేశారు ఇద్దరూ –

వాళ్ళ మొహాల్లోని విషాదం కుటుంబ సభ్యుల మనసులని కలచి వేసింది.

సాయంత్రం ఆరు గంటలవుతున్నట్టే అందర్లో టెన్షన్ మొదలయింది. ఏం చేయాలో పాలుపోని స్థితి!

ఆ రోజు మధ్యాహ్నం గుత్తి రోడ్లో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన వారితోనూ, వాళ్ళ బంధువులతోనూ ఆస్పత్రి రద్దీగా వుంది. ఆ గాయపడ్డ వారిలో రెవెన్యూ డివిజనల్ అధికారిగారి బంధువులు ఉన్నారని ఎవరో అనుకుంటున్నారు.

ఏ మాత్రం కదలిక లేకుండా వున్న గుర్నాథాన్ని చూస్తుంటే అతను తమకి దక్కడేమోనన్న భావన అందరి తలల్లోనూ పురుగులా తొలుస్తోంది. డాక్టరు చెప్పిన ఆరుగంటలు కాలం అయిపోవస్తోంది మరి.

"ఏమండీ! మహేషూ, దినేషూ వచ్చినారు చూడండీ!" అంది జానకమ్మ. గుర్నాథం చెవిలో అప్పుడన్నా అతనిలో చలనమొస్తుందేమోనని ఆమె ఆశ!

గుర్నాథంలో కదలికలేదు!

"ఏమండీ! మీ కోడళ్ళు సుబ్బలక్ష్మి, శారదలు వచ్చినారండీ" అంది మళ్ళీ.

ఊహూ, కదలికలేదు.

"ఏమండీ మీ ముద్దుల మనవలూ, మనవరాళ్ళు లావణ్యా, దివ్య, రాజేషు, రాకేషు వచ్చినారండీ - చూడండి, మీకోసం ఎంత ఇదిగా చూస్తున్నారో చూడండీ, ఒక్కసారి చూడండీ" అంటూ బొంగురు పోతున్న గొంతుతో దుఃఖాన్ని దిగమింగుతూ అంది జానకమ్మ.

అతనిలో కదలిక లేనేలేదు!

"నాన్నా నాన్నా" అంటూ కొడుకులూ, కూతుర్లూ పిలుస్తున్నారు. గుర్నాథంలో కదలిక లేదు.

"మామయ్యా" అంటూ పిలిచారు కోడళ్ళు - కదలిక లేదు.

"తాతయ్యా తాతయ్యా" అంటూ పిల్లలు కోరస్‌గా పిలిచారు. ఏమాత్రం కదలిక లేదు.

* * *

ఉన్నట్టుండి వార్డులో చిన్నగా కలకలం బయల్దేరింది.

బస్సు ప్రమాదంలో గాయపడ్డ బంధువుల్ని చూడ్డానికి రెవెన్యూ డివిజనల్ ఆఫీసరు వచ్చారు. అక్కడున్న వారంతా క్షణంలో నిశ్శబ్దంగా నిలుచుండిపోయారు. ఆయన బంధువుల్ని పరామర్శిస్తూ ఉన్నారు.

"ఎవరాయన" అన్నాడు మహేష్.

విషయం చెప్పింది సుగుణ. ఇంకా వివరణ కోసం "ఆయన నాన్నకు ఇంతకుముందున్న ఆఫీసరు" అంది.

ఏదో తన ఆఫీసులో ఇంతకు మునుపు పనిచేసిన గుమస్తా కదా అని సానుభూతి తోనయినా చూస్తాడు కదా అని వెళ్ళి తండ్రి గురించి చెప్పాడు మహేష్.

"అరెరె అట్లనా! గుర్నాథం కోమాలో వున్నాడా?" అంటూ టకా టకా అడుగులేస్తూ వస్తున్నాడు ఆఫీసరు,

'ఆఫీసరన్న' పదం వినిపించగానే గుర్నాథంలో కదలిక మొదలు కావడంతో "నాన్నా! మీ ఆఫీసరు వస్తున్నాడు" అంది సుగుణ తండ్రి చెవిలో - శవంలా పడి వున్న అతనిలో కదలికలు మరింత ఎక్కువయినాయి.

తండ్రిలో మార్పు గమనించి "వచ్చేసినారు నాన్నా మీ ఆఫీసరు" అంది సుగుణ.

అంతే -

గుర్నాథం కళ్ళు యాంత్రికంగా తెరుచుకున్నాయి.

ముక్కులో పెట్టిన ట్యూబులతో సహా టక్కున బెడ్డు మీద నుంచి లేచాడు గుర్నాథం. "నమస్తే సార్!"అన్నాడు వినయంగా.

అటు ఆఫీసర్లోనూ, ఇటు కుటుంబ సభ్యులందర్లోనూ ఒకటే ఆశ్చర్యం - ఆ గుర్నాథాన్ని చూస్తుంటే -

దటీజ్ గుర్నాథం!

(ఈనాడు ఆదివారం - 17 మే, 1998)